క్లుప్తంగా

పోసికుమార్‌కు సత్కారం



పోసికుమార్‌ను సత్కరిస్తున్న శ్రీనివాసులు రెడ్డి

రాజమహేంద్రవరం రూరల్: ఇటీవల హోప్ థియలాజికల్ యూనివర్సిటీ ద్వారా డాక్టరేట్ అందుకున్న స్ఫూర్తి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముత్యాల పోసికుమార్‌ను వైఎస్సార్ సీపీ నాయకుడు, ప్రముఖ న్యాయవాది గొందేశి శ్రీనివాసులు రెడ్డి ఆయన కార్యాలయంలో శుక్రవారం సత్కరించారు. ఆయన మాట్లాడుతూ సమాజ సేవకు ఎప్పుడూ గుర్తింపు ఉంటుందని, పోసికుమార్‌కు గౌరవ డాక్టరేట్ లభించడమే దానికి నిదర్శనమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ ముద్దాల అను తదితరులు పాల్గొన్నారు.

వైద్యానికి ఆర్థిక సాయం



చంటి కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందిస్తున్న చందన నాగేశ్వర్

కడియం: జేగురుపాడు గ్రామానికి చెందిన పెనుమాక చంటి అనే 27 యువకుడికి వైద్య ఖర్చుల కోసం శుక్రవారం రాష్ట్ర గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ ఆర్థిక సాయం అందజేశారు. పెయింటర్ అయిన చంటి ఇటీవల పనిలో ఉండగా తాడు తెగి కింద పడిపోయాడు. ఈ ప్రమాదంలో అతడి రెండు చేతులు, కాలు, ఛాతీ దగ్గర ఎముకలు విరిగిపోయాయి. ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న చందన నాగేశ్వర్ ఆర్థిక సాయం అందించారు.

జక్కంపూడి రాజా కుటుంబంపై విమర్శలు తగవు

మధురపూడి: ప్రజలకు అందుబాటులో ఉంటూ నిరంతరం సేవలు అందిస్తున్న జక్కంపూడి రాజా కుటుంబంపై జనసేన నాయకుడు బత్తుల బలరామకృష్ణ విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని కోరుకొండ జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు అన్నారు. కోరుకొండలోని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జక్కంపూడి కుటుంబంలో ఐదుగురు నాయకులు ప్రజలకు సేవలందిస్తున్నారన్నారు. రాజానగరం నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మే13 తేదీన జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలవడం ఖాయమన్నారు. అప్పుడు బత్తుల తరహా వారంతా ఎక్కడికి పారిపోతారో చూడాలని ఎద్దేవా చేశారు. వైఎస్సార్ సీపీ మండల కో కన్వీనర్ గణేశుల పోసయ్య మాట్లాడుతూ కార్మిక నాయకుడిగా కార్మికుల మన్నలను పొందిన దివంగత నేత జక్కంపూడి రామ్మోహనరావు అంచలంచెలుగా ఎదిగి, మంత్రిగా సేవలందించారన్నారు. ఆయన కుటుంబంపై విమర్శలు చేస్తే సహించేది లేదని విమర్శించారు. కొండపల్లి దుర్గారావు మాట్లాడుతూ ఎస్సీ, బీసీ వర్గాలకు చెందిన 18 మంది సర్పంచులు, 16 మంది ఎంపీటీసీలను ఎమ్మెల్యే రాజా గెలిపించి ఉన్నత స్థానంలో ఉంచారన్నారు. పల్లెల్లో అభివృద్ధిని పరుగులు తీయించిన రాజాను ప్రజలు గుండెల్లో పెట్టుకుంటారన్నారు.

టీడీపీ ఆవిర్భావ దినోత్సవం

రాజమహేంద్రవరం రూరల్: స్వర్గీయ నందమూరి తారక రామారావు ఆశయ సాధనకు టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి అన్నారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం తన నివాసంలో వేడుకలు నిర్వహించారు. మాజీ మంత్రి, జోన్ -2 కో ఆర్డినేటర్ సుజయ కృష్ణ రంగారావు పార్టీ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సినిమాలు



శ్యామల	: ది గోట్‌లైఫ్
సూర్యమినీ	: క్రూ
సూర్యప్యాలెస్	: గాడ్జిల్లా అండ్ కాంగ్
స్వామి	: టిల్లు స్క్వేర్
శివజ్యోతి	: ఓంభీమ్‌బుష్...
అనుశ్రీ	: గాడ్జిల్లా అండ్ కాంగ్
రాజా	: గాడ్జిల్లా అండ్ కాంగ్
ఊర్వశి	: కలియుగం, ప్రేమలు
రంభ	: గాడ్జిల్లా అండ్ కాంగ్
మేనక	: భీమా
అప్సర	: టిల్లు స్క్వేర్
కుమారి	: టిల్లు స్క్వేర్
నామవరం	
వీఎస్ మహల్	: టిల్లు స్క్వేర్
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	: టిల్లు స్క్వేర్
కడియం	
వెంకటసూర్య	: గాడ్జిల్లా అండ్ కాంగ్

మానవాళి రక్షణ కోసమే ఏసు మరణం

- ఎంపీ భరత్‌రామ్
- గుడ్‌ఫ్రైడే సందర్భంగా క్రైస్తవుల ర్యాలీ



శాంతి ర్యాలీలో మాట్లాడుతున్న ఎంపీ భరత్‌రామ్ తదితరులు



ర్యాలీ నిర్వహిస్తున్న బిషప్ థామస్ తదితరులు

సీటీఆర్ఐ: మానవాళిని పాపాల నుంచి విముక్తి చేయడానికి ఏసుక్రీస్తు ఎన్నో కష్టాలను అనుభవించారని, శిలువపై మరణం పొందారని రాజమహేంద్రవరం ఎంపీ, వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మార్గాని భరత్‌రామ్ అన్నారు. గుడ్ ఫ్రైడే సందర్భంగా రాజమహేంద్రవరం రూరల్ మండలం కొంతమూరు నుంచి గోదావరి రైల్వే స్టేషన్ వరకూ శుక్రవారం కాలినడకన భారీ ర్యాలీ నిర్వహించారు. శిలువను మోస్తున్న ఏసు వేషధారితో పాటు అనేక మంది శిలువలను చేతపట్టి ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ భరత్‌రామ్ మాట్లాడుతూ ఏసు చూపిన త్యాగం, సహనం, ప్రేమ, కరుణ ప్రతి ఒక్కరిలోనూ ఉండాలన్నారు. తోటివారిని ఆదుకోవడంలో ఎంతో తృప్తి ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ ఏసుక్రీస్తు చూపిన బాటలోనే పయనించాలని, అప్పుడే శాంతి నెలకొంటుందన్నారు. కార్యక్రమంలో గోదావరి విచారణ, దివ్యదర్శిని దేవాలయం, ఆశయ సంఘ సభ్యులు పాల్గొన్నారు. గోదావరి రైల్వే స్టేషన్ వద్దగల ఆశయం దేవాలయం వరకూ ర్యాలీ కొనసాగింది.

క్రైస్తవుల శాంతి ర్యాలీ

క్రీస్తు శిలువ మానవాళి విమోచనకు చేసిన బలి యాగమని దహించు అగ్ని మినిస్ట్రీస్ బిషప్ డాక్టర్ థామస్ అన్నారు. శుభ శుక్రవారం సందర్భంగా క్రైస్తవులు శాంతి ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రైస్తవులు మాత్రమే కాకుండా లోకమంతటా మనుషులందరూ జ్ఞాపకం చేసుకునే పరిశుద్ధమైన దినం శుభ శుక్రవారమన్నారు. మానవులందరూ పాపం నుంచి విడుదల పొంది, నీతి, న్యాయంతో, శాంతితో జీవించాలన్నారు. కార్యక్రమంలో అనేక మంది క్రైస్తవులు పాల్గొన్నారు.



దామిరెడ్డిపల్లి బైబిలు మిషన్ మందిరంలో ప్రార్థనలు

చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు

కడియం: మండలంలోని చర్చిల్లో శుక్రవారం గుడ్ ఫ్రైడే సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. శిలువపై నుంచి క్రీస్తు పలికిన మాటలను క్రైస్తవులు గుర్తు చేసుకున్నారు. దామిరెడ్డిపల్లి బైబిలు మిషన్ మహిమ మందిరంలో దేవరపల్లి రత్నరాజు ఆధ్వర్యంలో ప్రార్థనలు జరిగాయి. కార్యక్రమంలో దేవరపల్లి కళ్యాణి ఫ్రాన్సిస్, కొండేటి సునీల్‌కుమార్, మగ్గం లక్ష్మి, సంపర రాణి, ప్రసాద్, రాజు పాల్గొన్నారు.

అభివృద్ధి కనిపిస్తేనే ఓటు వేయండి

- ఎంపీ, వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి భరత్‌రామ్
- నగరంలో పర్యటన



వైఎస్సార్ సీపీలో చేరిన వారితో ఎంపీ భరత్‌రామ్



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: నగరాన్ని మూడేళ్లలో ఎంతో అభివృద్ధి చేశానని, ఆ అభివృద్ధి కనిపిస్తేనే తనకు ఓటు వేయాలని ప్రజలను ఎంపీ, వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మార్గాని భరత్‌రామ్ కోరారు. స్థానిక 40వ డివిజన్‌లోని సీతంపేట, బృహన్నలపేటలలో శుక్రవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టీడీపీ నాయకులు ఎన్నికల సమయంలో ప్రజల వద్దకు వచ్చి రకరకాల మాయమాటలు చెబుతారన్నారు. గెలిచిన తర్వాత కనిపించకుండా మాయమైపోతారన్నారు. 2019కి ముందు నగరం ఎలా ఉండేదో, జగనన్న ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎలా అభివృద్ధి చెందిందో గమనించాలని కోరారు. 2019లో సిటీ టీడీపీ ఎమ్మెల్యేగా గెలుపొందిన ఆదిరెడ్డి భవాని ఎప్పుడైనా నగరంలో ప్రజల వద్దకు వచ్చారా, ఒక్క అభివృద్ధి పని చేశారా అంటూ ధ్వజమెత్తారు. నగరాన్ని అభివృద్ధి చేసి ప్రజలను ఓట్లు అడిగితే తప్పులేదని, అభివృద్ధి చేయకుండా ఏ ముఖం పెట్టుకుని ఓట్లు అడగడానికి ప్రజల వద్దకు వస్తున్నారని ప్రశ్నించారు. నగరాన్ని టీడీపీ నాయకుల చేతిలో పెడితే గంజాయి బ్యాచ్, బ్లేడ్ బ్యాచ్, రౌడీ షీటర్లు, సంఘ విద్రోహ శక్తులు పెట్రేగిపోతారన్నారు. వారిని పెంచి పోషిస్తోంది టీడీపీ ఆదిరెడ్డి కుటుంబమే అని ఆరోపించారు. తాను ఎమ్మెల్యే గెలిస్తే సంఘ విద్రోహ శక్తులను ఉక్కుపాదంతో అణచివేసి, ప్రశాంత ఆధ్యాత్మిక, సాంస్కృతిక నగరంగా అభివృద్ధి చేస్తానన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరికలు

15వ డివిజన్‌లో టీడీపీ, జనసేన, బీజేపీలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు శుక్రవారం ఎంపీ మార్గాని భరత్ రామ్ సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వీరందరికీ ఆయన పార్టీ కండువాలు కప్పి ఆహ్వానం పలికారు. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, పాలిక శ్రీను, ఎన్‌వీ శ్రీనివాస్, నక్కా నగేష్ పాల్గొన్నారు.

అల్లా కృప అందరిపైనా ఉండాలి

అల్లా కృప అందరిపైనా ఉండాలని ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి మార్గాని భరత్ రామ్ అన్నారు. మెయిన్ రోడ్డులోని రాయల్ మసీదులో శుక్రవారం ముస్లిం నాయకుడు సయ్యద్ యూనస్ నిర్వహించిన ఇఫ్తార్ విందుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ కష్టాల్లో ఉన్నవారిని మానవత్వంతో ఆదుకోవడం, అందరితోనూ ప్రేమతో మెలగడం, ఉన్నదానిలోనే ఇతరులకు సహాయం చేయడం గొప్ప విశేషమన్నారు. ఇటువంటి మంచి గుణాలతో సమాజాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న ముస్లిం సోదరులందరికీ ప్రత్యేక అభినందనలు తెలిపారు. షాదీఖానా నిర్మాణానికి కావాల్సిన స్థలాన్ని ప్రభుత్వం ద్వారా మంజూరు చేయించి, శంకుస్థాపన కూడా చేయడం జరిగిందన్నారు. దీని నిర్మాణానికి తన ఎంపీ నిధుల నుంచి రూ.50 లక్షలు మంజూరు చేసినట్టు తెలిపారు. ముస్లింలకు ఏ అవసరం వచ్చినా సహకారం అందించేందుకు సిద్ధంగా ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, సయ్యద్ ఖాసిం, రజాక్, ఆరీఫ్, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రం వద్ద గిరజాల బాబు తదితరులు

కడియం: స్థానిక కూరగాయల మార్కెట్ వద్ద దొడ్డా శ్రీను జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు బాబీ, తాతాజీ శుక్రవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. దీనిని మాజీ ఎంపీ గిరజాల వెంకటస్వామి నాయుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు గిరజాల వీర్రాజు (బాబు) ప్రారంభించారు. వారు మాట్లాడుతూ దివంగత శ్రీను సామాజిక సేవా కార్యక్రమాల్లో ఎప్పుడు ముందుండేవారన్నారు. ఆయన సేవా స్ఫూర్తిని కుమారులు కొనసాగించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో దొడ్డా బుజ్జి, గిరజాల నాగేశ్వరరావు, ముమ్మిడి ప్రసాద్, చంద్రరావు, ఆర్‌ఎస్‌ఎన్ మూర్తి పాల్గొన్నారు.

కేవీకేలో పశువుల పెంపకంపై ముగిసిన శిక్షణ

రాజానగరం: పాడి రైతులకు మేలు చేకూర్చేలా సేవలందించాలని శిక్షణ పొందిన యువతకు కలవచర్ల కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) ప్రధానాధికారి డాక్టర్ వీఎస్‌జీఆర్ నాయుడు సూచించారు. పశు పోషణ, యాజమాన్య నైపుణ్యాలు, పశువులకు సోకే రోగాలకు ప్రాథమికంగా చేపట్టాల్సిన చికిత్సలపై జిల్లా ఆత్మ ప్రాజెక్టు సహకారంతో కేవీకేలో వారం రోజుల పాటు 15 మంది గ్రామీణ యువతకు శిక్షణ తరగతులు నిర్వహించారు. శుక్రవారం జరిగిన ముగింపు సమావేశంలో శిక్షణ పూర్తి చేసిన వారికి డాక్టర్ నాయుడు, ఆత్మ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ పి.జ్యోతిర్మయి చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేశారు. కేవీకే విశ్రాంత పశువైద్యాధికారులు డాక్టర్ జాన్ బాబు, డాక్టర్ పీవీవీఎస్ శివరావు ఆధ్వర్యంలో పశువులకు అందించే ప్రథమ చికిత్స, టీకాలు, వాటివల్ల పశువులకు కలిగే ప్రయోజనాలు, పశువులలో రోగనిరోధక శక్తిని ఏవిధంగా పెంచాలి అనే అంశాలపై శిక్షణ ఇచ్చారు. అనంతరం కేవీకేలోని పొట్టి మేకల పెంపకం, కోళ్ల పెంపకం యూనిట్లను, పశుగ్రాసం క్షేత్రాలను యువత సందర్శించింది. కార్యక్రమంలో టి.విజయవర్ధన్, జె.ప్రభాత్ నాయుడు పాల్గొన్నారు.

దాడి ఘటనపై కేసు

సీతానగరం: మండలంలోని రఘుదేవపురానికి చెందిన తూము ఫణీంద్రపై గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు దాడి చేసిన ఘటనపై ఆసుపత్రి సమాచారం మేరకు కేసు నమోదు చేశామని ఏఎస్సై సమర్పణరావు శుక్రవారం తెలిపారు. ఈనెల 27వ తేదీ రాత్రి 7.30 గంటలకు పశువులకు గడ్డి వేసి వస్తున్న ఫణీంద్రపై గోనెసంచితో ముసుగువేసి, ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా కొట్టారు. గాయాలపాలైన ఫణీంద్ర రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

గోరంట్ల కుమార్తె ప్రచారం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఉమ్మడి రూరల్ నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి గోరంట్ల బుచ్చయ్య చౌదరిని రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో గెలిపించాలని కోరుతూ 19వ డివిజన్‌లో ఆయన కుమార్తె కంఠంనేని శిరీష శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. డివిజన్ ఇన్‌చార్జి గొందేశి హరినాథ్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ గొందేశి మాధవీలత ఆధ్వర్యంలో రాష్ట్ర తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి మజ్జి పద్మ తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి వస్తువులకు ప్రజల ఆదరణ

- రేపటి వరకూ డిస్కౌంట్ సేల్స్
- నగర మేనేజర్ మోనిక



కలంకారి చేనేత వస్త్రాలను విక్రయిస్తున్న సిబ్బంది

సీటీఆర్ఐ: లేపాక్షి ఎంపోరియంలో ప్రకటించిన డిస్కౌంట్ సేల్స్ ప్రజలను ఆకట్టుకుంటున్నాయని లేపాక్షి నగర సంస్థ మేనేజర్ మోనిక అన్నారు. ఆమె బుధవారం మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ హస్తకళల అభివృద్ధి సంస్థ ఎండీ ఎం.బాలసుబ్రహ్మణ్యం రెడ్డి ఆదేశాల మేరకు ఎంపిక చేసిన ఉత్పత్తులపై 10 నుంచి 40 శాతం వరకూ డిస్కౌంట్ ఇస్తున్నామన్నారు. అన్ని రకాల చేనేత, హస్తకళల వస్తువులు అందుబాటులో ఉన్నాయన్నారు. లేపాక్షి ఎంపోరియంలో వస్తువులను కొనడం వలన హస్తకళలకు జీవం పోసినట్టు అవుతుందన్నారు. విదేశీయులు కూడా రాజమహేంద్రవరానికి విచ్చేసినప్పుడు లేపాక్షి ఎంపోరియంలో వస్తువులను కొనుగోలు చేస్తున్నారన్నారు. కళాకారులు చాలా రోజులు శ్రమించి తయారు చేసిన వైట్‌వుడ్ బొమ్మలు, ఏటికొప్పాక బొమ్మలు, లెదర్ పప్పెట్, కలంకారి వస్తువులు, నీమ్ ఉడ్ కళాఖండాలు, నటరాజ విగ్రహం వంటివి ప్రత్యేక ఆకర్షణగా ఉన్నాయన్నారు. చేనేత కళాకారులను ప్రోత్సహించేందుకు 10 శాతం నుంచి 40 శాతం వరకూ డిస్కౌంట్ ఇస్తున్నామని, ఈ తగ్గింపు ధరలు ఆదివారం వరకూ ఉంటాయన్నారు.

చంద్రబాబువి స్వార్థ రాజకీయాలు



ఆరిఫ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ముస్లిం నాయకులు

సీటీఆర్ఐ: చంద్రబాబు అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా తన స్వార్థ ప్రయోజనాల కోసం ముస్లిం, మైనార్టీలను పణంగా పెట్టడానికి ఎప్పుడూ వెనకాడరని వక్ఫ్ బోర్డ్ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ ఆరిఫ్ విమర్శించారు. జిల్లా మైనార్టీ సెల్ నాయకులతో కలిసి శుక్రవారం తన స్వగృహంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మతతత్వ బీజేపీతో పొత్తులో భాగంగా వైఎస్సార్ సీపీ నుంచి ముస్లిం మైనారిటీ అభ్యర్థుల పోటీలో ఉన్నచోట బీజేపీ అభ్యర్థులను నిలబెట్టడమే ఇందుకు నిదర్శనమన్నారు. మైనార్టీల సంక్షేమాన్ని ఏనాడు పట్టించుకోని చంద్రబాబు నాయుడు ఎన్నికలు సమీపిస్తున్న వేళ తన సెక్యులర్ ముసుగును తొలగించి, అసలు సిసలైన మతతత్వ నైజాన్ని బహిర్గతం చేసుకున్నారన్నారు. గతంలో కాంగ్రెస్‌తో చెలిమి చేసి బీజేపీపై తీవ్ర విమర్శలు చేసిన చంద్రబాబు, ఇప్పుడు ఎన్నికలు సమీపిస్తున్న వేళ మతతత్వ బీజేపీతో పొత్తు పెట్టుకోవడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలన్నీ ముఖ్యమంత్రి జగన్ పాలనలో సువర్ణ యుగాన్ని చూస్తున్నారన్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా వైఎస్సార్ సీపీ అఖండ విజయం సాధించడం ఖాయమన్నారు. చంద్రబాబు కుయుక్తులను రాష్ట్రంలోని ముస్లిం సమాజం గమనిస్తోందననారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు రమీజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ మస్తాన్, జిల్లా కార్యదర్శి మస్తాన్ బేగ్, జిల్లా సంయుక్త కార్యదర్శి సమీఖాన్ పాల్గొన్నారు.

జగన్ చేసిన మేలును ప్రజలకు వివరించండి



సమావేశంలో మాట్లాడుతున్న చెల్లుబోయిన నరేన్

- వైఎస్సార్ సీపీ నాయకుడు చెల్లుబోయిన నరేన్
- పార్టీ శ్రేణులతో సమావేశం

రాజమహేంద్రవరం రూరల్: రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్ పరిపాలన సాగిస్తున్నారని, ఆయన చేసిన మేలును ప్రజలందరికీ తెలియజేయాలని మంత్రి, వైఎస్సార్ సీపీ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి చెల్లుబోయిన వేణు కుమారుడు నరేన్ పిలుపునిచ్చారు. బొమ్మూరులోని వైఎస్సార్ సీపీ రూరల్ నియోజకవర్గ కార్యాలయంలో శుక్రవారం పార్టీ యూత్, బూత్ కన్వీనర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో రెండు ఓట్లూ వైఎస్సార్ సీపీ అభ్యర్థులకు వేసేలా చూడాలన్నారు. ప్రతిపక్షాల కుట్రలను తిప్పికొట్టడంలో విజయం సాధించాలన్నారు. అందరూ ఐక్యంగా పనిచేసి విజయానికి పాటుపడాలన్నారు.

గౌతమీ జీవకారుణ్య సంఘం ఆస్తులను కాపాడాలి



ఎయిర్ కూలర్లను అందజేస్తున్న టీకే విశ్వేశ్వర రెడ్డి

రాజమహేంద్రవరం సిటీ: గౌతమీ జీవకారుణ్య సంఘం ఆస్తులను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని రాజమహేంద్రి గోదావరి పరిరక్షణ సమితి అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి అన్నారు. తన తండ్రి తేతలి కనికిరెడ్డి జ్ఞాపకార్థం శుక్రవారం వృద్ధుల కోసం రెండు ఎయిర్ కూలర్లను బహూకరించారు. ఆయన మాట్లాడుతూ మట్టే నారాయణమ్మ 40 ఏళ్ల క్రితం గౌతమీ జీవకారుణ్య సంఘానికి 19.7 ఎకరాల స్థలం దానం చేశారన్నారు. సంఘానికి చెందిన ఆస్తులన్నీ వృద్ధాశ్రమం సంస్థకే చెందాలని వీలునామా కూడా రాశారన్నారు. దాన్ని పట్టించుకోకుండా ఆర్టీఓ కార్యాలయానికి మూడెకరాలు, గో రక్షణ సంఘానికి మూడెకరాలు, దేవదాయశాఖ డీసీ ఆఫీస్, గెస్ట్‌హౌస్, ఆలయానికి రెండెకరాల స్థలాన్ని నిబంధనలకు విరుద్ధంగా తీసుకున్నారన్నారు. రూ.కోట్లు విలువైన ఈ భూములను అన్యాక్రాంతం చేయడానికి ప్రయత్నించడం దారుణమన్నారు. వృద్ధులు, కుష్ఠురోగులు, అనాథలు, అంధులకు ఆశ్రయం కల్పించాల్సిన జీవకారుణ్య సంఘం స్థలాన్ని ఈ విధంగా కట్టబెట్టడం సమంజసం కాదన్నారు. నగరంలోని చాలా చోట్ల బిచ్చగాళ్ల వల్ల ట్రాఫిక్‌కు, వాహన చోదకులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, వారందర్నీ జీవకారుణ్య సంఘానికి తరలించి ఆహారం, వసతి, వైద్య సదుపాయం కల్పిస్తే బిచ్చగాళ్లు లేని నగరంగా మార్చడానికి అవకాశం ఉంటుందన్నారు.

వ్యాయామానికి సైక్లింగ్

- ఆరోగ్యంపై నగరవాసుల శ్రద్ధ
- సైక్లింగ్‌తో అనేక ప్రయోజనాలు



సైక్లింగ్ చేస్తున్న యువకులు

ప్రకాశం నగర్: నిత్య వ్యాయామంతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుంది. మనకు మానసిక, శారీరక ఉల్లాసం కలుగుతుంది. ఆధునిక జీవన శైలిలో ప్రజలకు శారీరక శ్రమ పడే అవసరం తగ్గిపోయింది. దీంతో వ్యాయామం లేక అనేక ఇబ్బందులు కలుగుతున్నాయి. చిన్న వయసులోనే వివిధ రోగాలు వస్తున్నాయి. ప్రస్తుత జీవన శైలిలో మంచి ఆహారంతో పాటు మంచి ఆరోగ్యం కోసం వ్యాయామం చేయాలని వైద్యులు సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలో నగర వాసులు వ్యాయామం బాట పడ్డారు. ఉదయం సాయంత్రం వేళల్లో వాకింగ్, జాగింగ్, సైక్లింగ్ వంటి వాటిని చేస్తున్నారు. మరికొందరు యోగా, జిమ్‌లకు క్యూ కడుతున్నారు. వాకింగ్‌తో పోలిస్తే సైక్లింగ్‌తోనే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని పలువురు వ్యాయామ విశ్లేషకులు చెబుతున్నారు. ఒక నిమిషం సైక్లింగ్‌తో శరీరంలో 12 క్యాలరీల శక్తి ఖర్చు అవుతుందన్నారు. శరీరంలోని కొవ్వును కరిగించి, అధిక బరువు సమస్యను కూడా తొలగిస్తుందన్నారు. ప్రతి రోజు ఒక అరగంట సైకిల్ తొక్కడం వల్ల శారీరక ధృడత్వంతో పాటు రోగ నిరోధక శక్తి, మెరుగు పడుతుందని వ్యాయామ నిపుణులు చెబుతున్నారు.

అనారోగ్యానికి దూరంగా..

మారిన ఆహారపు అలవాట్ల కారణంగా జనాభాలో అధిక శాతం మంది స్థూలకాయం సమస్యతో బాధపడుతున్నారు. ఫాస్ట్ ఫుడ్, కేక్‌లు, పిజ్జా, బర్గర్లు అధికంగా తినడం వల్ల అనేక సమస్యలు ఏర్పడుతున్నాయి. అధిక బరువు సమస్యతో బాధపడుతున్న వారికి సైక్లింగ్ మంచి వ్యాయామ సాధనం. పెరిగిన టెక్నాలజీతో ట్రెడ్ మిల్ తదితర సాధనాలు అందుబాటులోకి వచ్చాయి. ప్రతి రోజు సైకిల్ తొక్కడం వల్ల గుండె జబ్బులు, హార్ట్ స్ట్రోక్ వంటి ప్రమాదాల బారిన పడే అవకాశాలు తక్కువగా ఉంటాయి.

> **ప్రజలకు అవగాహన**
>
> కరోనా విపత్కర పరిస్థితుల అనంతరం ఆహారపు అలవాట్లు, వ్యాయామం, పరిశుభ్రత వంటి విషయాలపై ప్రజలకు అవగాహన వచ్చింది. ముఖ్యంగా మంచి ఆరోగ్యం కోసం శ్రద్ధ తీసుకుంటున్నారు. ప్రతి రోజు ఒక గంట నడక, లేనిపక్షంలో అరగంట సైక్లింగ్ చేయడం వల్ల ఆరోగ్యం బాగుంటుంది.
>
> – ఏవీడీ ప్రసాదరావు, పీడీ

ముసలమ్మ అమ్మవారికి లక్ష పుష్పార్చన

కడియం: కడియపులంక గ్రామ దేవత ముసలమ్మ అమ్మవారి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా మూడో రోజు శుక్రవారం 108 రకాల పుష్పాలు, ఒక్కో రకానికి చెందిన 108 పుష్పాలతో అమ్మవారికి లక్ష పుష్పార్చన నిర్వహించారు. సత్యదేవ నర్సరీ, కొత్తపల్లి సత్తిరాజు దంపతుల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. అనంతరం పంచ మంగళ హారతులు, పవళింపు సేవ జరిగాయి.



అమ్మవారికి పుష్పార్చన చేసేందుకు తీసుకువచ్చిన వివిధ రకాల పువ్వులు